# మాయమైన మనిషి!

**– గంటి రమాదేవి**

**పరిస్తాన్ దేశపు గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన వ్యక్తి ఆయన. ఇంచుమించు రెండు దశాబ్దాల క్రితం భారత్ యుద్ధంలో అఖండ విజయం సాధించడంలో ఆయన పాత్ర చాలా ఉంది. ఆయన పేరు రాజేందర్. ఆరు అడుగుల ఎత్తు, బలమైన శరీరం, తీక్షణమైన బుద్ధి కుశలత ఆయన ఐడెంటిటీ.**

**చిన్న వయసు, ఆకర్షణీయమైన శరీరం, బాస్‌కి తగిన విధంగా వుండే ఆయన అసిస్టెంట్ కుమార్, వారికిద్దరికీ ఎంతో కావాల్సినవాడు ఇనస్పెక్టర్ ఈశ్వరరావు.**

**ఆ ముగ్గురి కలయిక బ్రహ్మ, విష్ణు మహేశ్వరుల కలయిక లాంటిది.**

పరిస్థాన్ ప్రభుత్వం భారత్‌ని ఎన్నో విధాలుగా ఇబ్బందులు పెడుతోంది. అప్పనంగా ఒక రాష్ట్రాన్ని తన దేశంలో కలుపుకోవడానికి ఎత్తులు వేస్తోంది.

ఆ దేశపు గూఢచారి వలయాన్ని ఛేదించి తిరిగి వచ్చారు రాజేందర్, కుమార్‌లు.

★★★

ఉదయాన్నే ఎక్సర్‌సైజు, స్నానాదులు ముగించి పేపరు చూస్తున్నాడు రాజేందర్.

కంప్యూటర్‌మీద పని చేసుకుంటున్నాడు కుమార్.

ఈశ్వరరావు మోటార్‌సైకిల్ గుమ్మం ముందు ఆగింది. గబగబా లోపలికి వచ్చాడు.

రాజేందర్‌తో కరచాలనం చేసి కుర్చీలో కూర్చున్నాడు ఈశ్వరరావు.

పాత వంటవాడు పదవీ విరమణ చేసిన తర్వాత అతని కోడలు పనిలో చేరింది.

ఆమె తెచ్చిన కాఫీ, టిఫిన్ అయిన తరువాత ఈశ్వరరావు అన్నాడు.

''అసలు ఈ కేసు మీ వరకూ తీసుకురావడమంటే బ్రాడ్‌మెన్‌ని, సచిన్‌ని బిళ్లంగోడు ఆడమన్నట్లు వుంటుంది. కానీ ఈ కేసులో క్లూలేవీ లేవని సెంట్రల్ పోలీస్ స్టేషన్ సిఐ ఫోన్ చేసి చెప్పాడు. నేను చూసాను. డిటో.''

రాజేందర్ పేపరు ప్రక్కనపెట్టి చెప్పమన్నట్లు చూశాడు.

''ఎస్.ఆర్.తాత పేరు వినే వుంటారు. కోటీశ్వరుడు. మార్నింగ్ వాక్‌కి వెళ్లి తిరిగి రాలేదు. ధనవంతులకు, రాజకీయ నాయకులకు, శత్రువులకు కొదవలేదు కదా!''

''మనం వెడదాం. ఆయన వాకింగ్‌కి ఎక్కడికి వెళతారు?''

''శాంథోమ్ బీచ్‌కి!''

మరుక్షణంలో వారిద్దర్నీ మోసుకుంటూ శాంథోమ్ బీచ్‌వైపు బుల్లెట్ దూసుకుపోయింది.

★★★

అక్కడ పోలీసు బందోబస్తు పకడ్బందీగా వుంది. మధ్యలో ఒక జీపు ఆగి ఉంది. ముందు టైర్‌లో గాలి తగ్గి ఉంది. ప్రెస్, ప్రైవేట్ టీవీ వాళ్లు అక్కడకు చేరుకున్నారు. పోలీస్ ఫోటోగ్రాఫర్ ఫోటోలు తీస్తున్నాడు. వేలిముద్రల నిపుణులు వాళ్ల పని కానిస్తున్నారు.

కుమార్‌ని, ఈశ్వరరావుని చూడగానే అందరూ పక్కకి తప్పుకున్నారు.

మోటార్‌సైకిల్ స్టాండువేసి ఇద్దరూ అక్కడ నిలిచివున్న జీపువైపు నడిచారు. కుమార్ నిశితమైన కళ్లు ఒక క్షణంలో చాలా వివరాలు సేకరించాయి.

జీపు తాళం చెవులు లేవు. సీటుమీద ఎండిపోయిన రక్తపు మరకలు. డ్రైవర్ సీటు కోతకు గురయింది. రెండు మూడు కట్స్. జీపు చుట్టూరా తిరిగి చూసాడు.

జీపు కింద తళతళ మెరుస్తూ ఇసుకలో దాదాపు కప్పబడివున్న ఒక వస్తువు కుమార్ కంటబడింది. చటుక్కున వంగి తన కర్చీఫ్‌తో ఆ వస్తువు తీసాడు. ఆరంగుళాల కత్తి. దుబాయ్ నుండి ధనవంతులు తెచ్చుకునే కిచెన్ సెట్‌లో వుండేది. అది డ్యూటీలో వున్న ఇన్‌స్పెక్టర్‌కిచ్చి ఏదో చెప్పాడు కుమార్.

అప్పటికే సిటీ ఛానెల్స్‌లో ఎస్.ఆర్.తాతా హత్య వార్త ప్రసారమవుతోంది.

ఎస్.ఆర్.తాతా గురించి ప్రొఫైల్ ప్రసారమవుతోంది. శాంథోమ్ బీచ్, ఆ వెనుక ఎగిసి పడుతున్న సముద్రం, పడవలు చూపిస్తున్నారు. రాజేందర్ కళ్లు ఒక్కసారి కాన్సన్‌ట్రేట్ చేశాడు ప్రసారమవుతున్న దృశ్యం చూసి. దూరంగా పల్లెవాళ్ల గుడిసెలు, తర్వాత సీన్లో కుమార్ ఇన్‌స్పెక్టర్‌కు ఇచ్చిన వస్తువు క్లోజప్‌లో చూపారు. మూడు అంగుళాలవరకు రక్తంతో తడిసిన మరక కత్తి మీద.

''సర్! ఈ తాతా బాగా డబ్బున్నవాడు. ఈ స్లంప్స్ సీజన్‌లో కూడా తాతా కంపెనీ షేర్లు విపరీతంగా ట్రేడ్ అవుతున్నాయి. ఈ ఆర్నెలల్లో రూ.170 వున్న ఈ కంపెనీ షేర్ ఈ రోజు రూ.747 కోడ్ అయినట్టు పేపర్లో వుంది. నిన్నటి ట్రాన్సాక్షన్ అది. విదేశీయులు దీన్ని విపరీతంగా కొన్నారు. అఫ్‌కోర్స్! అది సాఫ్ట్‌వేర్ కంపెనీ షేర్. మిగిలిన కంపెనీలు పేర్లూ బాగా రైజ్‌లో ఉన్నాయి.''

ఈశ్వరరావు అందుకున్నాడు.

''కుటుంబం విషయానికొస్తే తాతాకి ముగ్గురు కొడుకులు. ఆడపిల్లలు లేరు. భార్య మీనాక్షి. బిజినెస్ రైవల్స్ ఎవరో హత్య చేసుంటారు.''

రాజేందర్ నవ్వుతూ అన్నాడు ''మరి ఆ శవాన్ని ఎందుకు ఎత్తుకుపోయారు?''

ఈశ్వరరావు అదిరిపడ్డాడు.

''అవును. వాళ్లు ఆ బాడీని ఏం చేసుకుంటారు?''

''బహుశా కిడ్నాప్ చేసి రాన్‌సమ్ అడుగుతారేమో!''

''మరి ఆ మాత్రం దానికి కత్తితో పొడవడం ఎందుకు? అదీ మూడంగుళాల లోతుగా!'' కుమార్ అన్నాడు.

ఈశ్వరరావు తడబడ్డాడు. రాజేందర్, కుమార్‌వైపు చూశాడు. కుమార్‌కి అర్థమైంది.

''ఆ ముగ్గురు కొడుకుల్ని ఇక్కడకు తీసుకురండి. వాళ్లతో మాట్లాడాలి'' ఈశ్వరరావుతో అన్నాడు కుమార్.

★★★

మధ్యాహ్నపు ఎండలో సముద్రం కరిగించిన తగరంలా మెరుస్తోంది. ప్రెస్‌వాళ్లు, ప్రైవేట్ ఛానల్‌వాళ్లు వెళ్లిపోయారు. జీపు దగ్గర ముగ్గురు కానిస్టేబుళ్లు కాపలా కాస్తున్నారు.

కుమార్‌ను చూడగానే సెల్యూట్ చేసారు. జీపును మరలా పరీక్షించాడు. కత్తితో డ్రైవింగ్ సీటు మీద కోసిన గుర్తులు. క్లచ్, బ్రేకులు దగ్గర రక్తపు మరకలు. జీపు దగ్గర ఇసుకలో పాదాల గుర్తులు. కొద్ది దూరంలో మిగిలిన పాదాల గుర్తులతో కలిసిపోయాయి.

**తాతా తిరిగి వచ్చేసాడు. ప్రెస్‌మీట్ పెట్టి తను కావాలనే మాయమయినట్టు, తన పిల్లలని దారిలో పెట్టడం కోసమే అలా చేయవలసి వచ్చిందని, గత్యంతరం లేకపోయిందని చెప్పాడు. ఇండస్ట్రీ తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. తాతా షేర్లు మళ్లీ ప్రాచుర్యంలోకి వచ్చాయి. పోలీసులు అరెస్టు వారెంట్ తయారు చేయలేకపోయారు.**

రాజు నడుచుకుంటూ పల్లెవాళ్ల గుడిసెలకేసి వెళ్లాడు. మురికిలో ఆడుకుంటున్నారు కొంతమంది పిల్లలు. రాజును చూడగానే చుట్టూ చేరారు అరుస్తూ కోలాహలంగా.

బాగా వంగిపోయిన ఒక ముసలాయన కర్రసాయంతో గుడిసె బయటకు వచ్చాడు. దగ్గుతున్నాడు. రాజు అతన్ని కొన్ని ప్రశ్నలు వేసాడు.

వస్తూ వస్తూ తనతో తెచ్చుకున్న బిస్కెట్స్, చాక్లెట్స్ పిల్లలకిచ్చాడు. ముసలాయన ఆసక్తిగా చూసాడు. బిస్కెట్ పాకెట్స్ అతనికిచ్చి కృతజ్ఞతలు తెలిపి వచ్చేశాడు.

ఆ వృద్ధుడు చెప్పిన సమాచారం చాలా విలువైంది. ఆర్.ఎస్.తాతా కిడ్నాప్‌లో చాలా లోతైన విషయం వుంది. దారుణమైన కుట్ర కూడా వుండే వీలుంది. కోట్లాది రూపాయల వెనుక ఎప్పుడూ వుండేదే!

★★★



ఆ ముగ్గురూ వచ్చారు. రాజేందర్ వాళ్లను కూచోమన్నాడు. ఇరవై రెండేళ్ల నుంచి ఇరవై ఎనిమిది ఏళ్ల వయసులో ఉన్నారు ఆ ముగ్గురూ. నవీనతకు అద్దం పట్టే నవ యువకులు.

ఈశ్వరరావు వాళ్లని పరిచయం చేసాడు. అందరిలోనూ పెద్దవాడు ధృవ్ తాతా ఎంబిఏ చదివాడు. రెండవ వాడు అర్జున్ తాతా రాజస్తాన్‌లో ఒక ఇంజనీరింగ్ కాలేజీలో చదువు పూర్తి చేసాడు. మూడోవాడు సినీ హీరో అవ్వాలని ప్రయత్నిస్తున్నాడు.

యవ్వనం, డబ్బు ఇచ్చే మెరుపు, నిర్లక్ష్యం, ఆరోగ్యం, అహంకారం ముగ్గురిలో స్పష్టంగా కనిపిస్తున్నాయి.

''మీ నాన్నగారు మాయమవడం గురించి మీ అభిప్రాయం?'' రాజేందర్ అడిగాడు ధృవ్ తాతాని.

''హీ ఈజ్ మేడ్. ఈ కంపెనీలన్నీ అమ్మేసి కెనడాలో సెటిలవుదామనుకున్నాను. కంపు, వేడి తప్ప మద్రాస్‌లో ఏముంది?''

అర్జున్ అన్నాడు ''రైట్ రైట్. ఏడ్ బిజినెస్‌లో బాగా డబ్బు, పేరు వస్తాయి. మరి మా డాడీ ప్రతి ఇంట్లోనూ తన ప్రొడక్ట్సు వుండాలిట. సాల్ట్‌నుంచి ప్లేనువరకు. కిచెన్ మెంటాలిటీ!''

''ఒక్క పిక్చర్ తీస్తే కోట్లు వస్తాయి. మంచి పేరు, కవరేజి. ఆ క్రేజ్ కంపెనీల్లో వుంటుందా?'' ఆఖరివాడు అన్నాడు.

''మీ డాడీ మర్డరయ్యారో, కిడ్నాప్ అయ్యారో తెలియదు. మరీ ఈ ఉదయం నుండి ఏం చేస్తున్నారు?'' అడిగాడు రాజేందర్.

''మేము మధ్యాహ్నం పన్నెండు లోపల ఎప్పుడూ లేవం. పడుకోవడం తెల్లవారుఝామునే. మీ ఇన్‌స్పెక్టర్ చెప్పేంతవరకూ మా డాడీ తప్పిపోయినట్లు తెలియదు'' ముగ్గురూ అన్నారు.

★★★

మర్నాడు పేపర్లలో ఎస్.ఆర్.తాతా హత్య గురించి వేసారు. తాతా కంపెనీ షేర్లు హఠాత్తుగా పతనమయ్యాయి. ఎకనామిక్ టైమ్స్, ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్ తాతా కంపెనీ భవితవ్యం గురించి వివరంగా రాసాయి.

రాజేందర్ చెప్పిన విధంగా కుమార్, ఈశ్వరరావు ఆర్.ఎస్.తాతా ముగ్గురు కొడుకుల గురించి వివరాలు సేకరించారు. తండ్రిని మాయం చేసేటంతటి ఘనులు కారు.

క్రమంగా తాతా గురించి వార్తలు తగ్గాయి. వారం తిరిగినా పోలీసులకు క్లూ చిక్కలేదు. రాజేందర్, కుమార్‌ల పరిశోధన దరిదాపుల్లో కూడా లేరు పోలీసులు.

తొమ్మిదోరోజు రాజేందర్ ఆఫీసులో సమావేశమయ్యారు కుమార్, ఈశ్వరరావులు.

రాజేందర్ హఠాత్తుగా అన్నాడు ''తాతా హత్య గావింపబడలేదు.''

కాఫీ తాగుతున్న ఈశ్వరరావుకి పొలమారింది. చిరునవ్వు నవ్వి అన్నాడు కుమార్.

''తాతా మాయమైన రోజున ఎంక్వయిరీ చేశాను. బీచ్‌కి దూరంగా వున్న గుడిసెల్లో ఒకాయన తాతాను చూసాడు. జీపులో నుంచి దిగిన వ్యక్తి గుడిసెల దగ్గర సెంటర్లో ఆటో ఎక్కి ఎటో వెళ్లిపోయాడని చెప్పాడు. మద్రాస్‌లో కొన్ని వేల ఆటోలలో ఏ ఆటో అని వెతకాలి. పోలీసులకు చెప్పినా ప్రయోజనం లేదని చెప్పలేదు. మళ్లీ నిన్ననే అక్కడికి వెళ్లాను ఆటో ఆనవాళ్ల గురించి. దొరికింది.''

రాజేందర్, ఈశ్వరరావును చూసి అన్నాడు.

''జూనియర్ తాతాలు ఏమంటున్నారు?''

''పాపం పెద్దాయన పోవడంతో కష్టాలొచ్చి పడ్డాయి. ఇప్పుడు రాత్రి పొద్దుపోయేవరకు క్లబ్బుల్లో, డిస్కోల్లో ఉండాలంటే కుదరడంలేదు. ముగ్గురూ తప్పనిసరిగా ఆఫీసులో పని చేయాల్సి వస్తోంది. తాతా షేర్ల వేల్యూ కొనే నాధుడు లేక పేలవంగా ట్రేడ్ అవుతున్నాయి. ఫేమిలీ ప్రైడ్ గురించి ఆ ముగ్గురూ వర్రీ అవుతున్నట్టుంది. కుమార్! ఆ ఆటోవాడి గురించి ఏం తెలిసింది? వాడు కిడ్నాప్ చేసి రాన్‌సమ్ అడుగుతున్నాడా?''

''లేదు. వాడు మద్రాస్‌లో ఉండే తెలుగువాడు. నన్ను చూచి ఏడవకురా! అని తెలుగులో రాసుకుని తన భాషాభిమానం చాటుకున్నాడు. దానివల్ల తొందరగా తొందరగా దొరికాడు. సీనియర్ తాతా ఆ క్రితం రోజే చెప్పాడు వాడిని అక్కడ వుండమని.''

ఈశ్వరరావు ఫోన్ అందుకుని సెంట్రల్ స్టేషన్‌కు ఫోన్ చేసి చెప్పాడు.

''ఎస్.ఆర్.తాతా నగరంలో ఏదో హోటల్లో మారు పేరుతో వుంటాడు వెతకండి.''

రాజేందర్ తన అంగీకార సూచకంగా తలూపాడు.

మధ్యాహ్నం వరకు పోలీసులు పని ముగించారు.

తాతా దొరికాడు సిటీకి ఇరవై మైళ్ల దూరంలో శ్రీ గురుదత్తా ఆశ్రమంలో.

★★★

జూనియర్ తాతాలకు తను దొరికిన విషయం తెలుపవద్దన్నాడు ఎస్.ఆర్.తాతా.

అతను చేసినది నేరం కాదు. కానీ ఎందుకు చేసాడు? ఏం ప్రయోజనం ఆశించి చేసాడు? ఈ ప్రశ్నలు తేలుకొండీల్లా ఈశ్వరరావును తొలుస్తున్నాయి. మరో ప్రశ్న! కొడుకులకి తను బతికున్నట్లు ఎందుకు చెప్పలేదు? ఎందుకంత పకడ్బందీ ప్లాను వేసాడు. కత్తి, రక్తం, సీటు కోయడం?

రాజేందర్ అనుమతించిన మీదట తాతాని వదిలేసారు. ఆయన విడిచిన కత్తిమీద రక్తం, సీటు మీద రక్తం ఒక బ్లడ్ బ్యాంకు నుంచి కొన్న రక్తం సీసాలోనివి. కొన్న రక్తం.

ఈశ్వరరావు నిరాశగా ఫీలయ్యాడు. మరీ చప్పగా తయారయింది కేసు. నో మర్డర్! నో కిడ్నాప్!

తాతా మరలా మాయమయ్యాడు. ఇంటికి వెళ్లలేదు.

కుమార్, రాజేందర్ ఇంకా పరిశోధన ముగించలేదు. ఇదొక చిత్రం. ఈశ్వరరావుకు ఆశ్చర్యంగా ఉంది. ఇంకా ఏముంది పరిశోధించడానికి? అప్పుడు అవగతమయింది పూర్తిగా.

''ఆర్.ఎస్.తాతా ముగ్గురు కొడుకులు బడుద్ధాయిలుగా తయారయ్యారు. వాళ్లు అతను చెప్పిన మాటలు, బుద్ధులు వాళ్లమీద పని చేయలేదు. అందుకే మాయమయ్యాడు. కొడుకుల్లో మంచి మార్పు వచ్చిన తర్వాత తిరిగి వస్తాడు.''

ఈశ్వరరావు ఇంటికి తిరిగి వెళ్లబోతుండగా కుమార్ వచ్చాడు. రాజేందర్‌తో అన్నాడు.

''మీ ఊహ కరెక్టే సార్. దాదాపు నాలుగువందల కోట్ల మేరకు మోసం జరిగింది. తాతా తెలివిగా ప్లాన్ చేసాడు.''


ఈశ్వరరావుకు మతిపోతోంది.

''తాతా నాలుగువందల కోట్లకు మోసం చేసాడు? ఎలా?''

''మా ఎస్ఐకి ఫోన్ చేసి చెప్పనా అరెస్టు చేయమని?'' ఆవేశంగా అన్నాడు ఈశ్వరరావు.

రాజేందర్ అన్నాడు ''తాతా మోసం చేసాడు. కానీ అతని వర్షన్ వేరేగా ఉంటుంది.''

చీటింగ్ కేసు క్రింద అరెస్టు చేయమని పోలీసులకు చెప్పాలా? మరి ఏ చీటింగ్ అంటే సమాధానం? ఇల్లు విడిచి రెండువారాలు బయట వుండడం చీటింగా?




ఆ సాయంత్రం సమాధానం దొరికింది ఈశ్వరరావుకి.

తాతా తిరిగి వచ్చేసాడు. ప్రెస్‌మీట్ పెట్టి తను కావాలనే మాయమయినట్టు, తన పిల్లలని దారిలో పెట్టడం కోసమే అలా చేయవలసి వచ్చిందని, గత్యంతరం లేకపోయిందని చెప్పాడు. ఇండస్ట్రీ తేలిగ్గా ఊపిరి పీల్చుకుంది. తాతా షేర్లు మళ్లీ ప్రాచుర్యంలోకి వచ్చాయి. పోలీసులు అరెస్టు వారెంట్ తయారు చేయలేకపోయారు.

★★★

రాజేందర్‌ని అడిగాడు ఈశ్వరరావు.

''మరి చీటింగ్ అన్నారు. తాతా క్రిమినలా?''

''తాతా మేధావి. అతని బిజినెస్ ఎక్యూమన్ అసాధారణం. ఈ రెండువారాల్లో అతను దాదాపు నాలుగువందల కోట్లు సంపాదించాడు. మాకు వెంటనే అనుమానం వచ్చి పరిశోధించాం. దీన్లో మరో పాత్ర ముద్రోచ్ ఫైనాన్సింగ్ కంపెనీది. అన్నీ న్యాయబద్ధంగా చేసారు. మోసమే! కానీ మనమేం చేయలేం!''

ఈ షేర్లంటేనే బోరు ఈశ్వరరావుకి. అర్ధం కావడం లేదు.

''సింపుల్‌గా చెప్పాలంటే తాతా మాయమయినప్పటి నుండి ఆ కంపెనీలు వాటా ధరలు తగ్గిపోయాయి. తను మాయమయిన వారంలో బజార్లో దొరికే వాటాలు చవకగా కొనమని ఆదేశించాడు ముద్రోచ్ కంపెనీకి. తను తిరిగి రాగానే వాటి విలువ పెరిగింది. అతని లాభం చాలా వుంది.''

''అది క్రైమ్ కాదా?''

''కాదు. కొత్తగా వచ్చిన చట్టం ప్రకారం కాదు. తన కంపెనీ షేర్లు తనే కొనుక్కోవచ్చు!''

ఈశ్వరరావుకి అర్ధం అయింది. పదిహేను రోజుల్లో నాలుగువందల కోట్లు. రోజుకి ఇరవై అయిదు కోట్లపై మాటే. అంటే గంటకి కోటి రూపాయల సంపాదన. లా ప్రకారం చేసిన మోసం!

''బ్రిలియంట్. ఇంతకీ ఎవరీ తాతా? రూర్కెల్లానా?'' అడిగాడు కుమార్‌ని.

''రూర్కెలా కాదు. తూర్పు గోదావరి జిల్లా.''

''ఎస్.ఆర్.తాతా అంటే సోరాబ్జీ రుస్తుంజీ తాతా అనుకున్నాను.''

''సోరాబ్జీ రుస్తుంజీ తాతా కాదు సుబ్బారావు తాతా.''

''బీహారా లేక...''

''పేరూరు''

''తాతా''

''అది తెలుగువాళ్లలో ఒక ఇంటి పేరు''

''మాయమైన మనిషి మనవాడే.''

ఈశ్వరరావుకి సంతృప్తిగా వుంది తాతా సుబ్బారావు తెలుగువాడు అయినందుకు.

★